**నమ్మలేని నిజాలు**

కోపతాపాలు
కోరికలకు మూలం
సంతృప్తే శాంతం.

కర్మతో జన్మ
ఆత్మ అద్వైతమర్మం
జీవన సంద్రం.

దారులు వేరు
చెట్టుకు ఒకే వేరు
సమైక్య దేశం.

తెలుగు భాష
వాణీవీణాతంత్రులు
స్వరాల జల్లు.

కుజగ్రహం
తొలి సౌరవలయం
కార్బన్ అధికం

– రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

**శ్రీనిజాలు**

ప్రధానమైన పార్టీలు
మునుగోడులో మూడు !
రంకె వేసి సిద్ధమైన
ఏ ఆంబోతు లోడు !

కాంగ్రెసు పార్టీలోన
మంచు గుండెలు కరిగే !
అధ్యక్షుని ఎన్ను కొనిరి
మల్లికార్జున ఖర్గే !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 20-10-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 62 | పేజీలు:6 | వెల: రూ.1/-


## చిట్యాల పాఠశాలను సందర్శించిన కోఆర్డినేటర్ బుచ్చయ్య



మహబూబాబాద్, అక్టోబర్ 19:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ మరియు క్వాలిటీ ఎడ్యుకేషనల్ కోఆర్డినేటర్ మహంకాళి బుచ్చయ్య సందర్శించడం జరిగింది. తొలిమెట్టు ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళిక రూపొందించుకొని విద్యార్థులకు బోధించాలని, విద్యార్థుల స్థాయి కి అనుగుణంగా బోధన జరగాలని అన్నారు. విద్యార్థులను అన్ని సబ్జెక్టలలో పరిశీలన చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో అర్పి ప్రవీణ్ , చిట్యాల హెచ్ఎం కె.నరేష్ , ఉపాధ్యాయులు చింతల సురేష్, రాయలు అంజనేయులు, మధు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి : డీజీపీ మహేందర్‌రెడ్డి



ములుగు, అక్టోబర్ 19: తెలంగాణలో మావోయిస్టుల సమస్య పునరావృతం కాకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంటూ అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ? ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన వెంకటాపురం నూగూరు మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సరిహద్దు ప్రాంతంలో ఉన్న జిల్లాల పోలీసు అధికారులతో సమీక్షను నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.


మావోయిస్టు ఆర్గనైజేషన్ మొత్తంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 1 30 మంది వరకు పనిచేస్తున్నారని ముఖ్యంగా సెంట్రల్ కమిటీలోని 20 మందిలో 11 మంది తెలంగాణకు చెందిన వ్యక్తులు ఉన్నారని ఆయన వివరించారు. వీరంతా అజ్ఞాతం వీడి పోలీసుల ఎదుట లొంగి జన జీవన స్రవంతిలో కలిస్తే పునరావసం కల్పిస్తామని తెలిపారు. అందుకు ప్రభుత్వంలోని అన్ని శాఖలు సహకారాలు అందజేస్తుందని అన్నారు. మావోయిస్టులను అదుపు చేసేందుకు అంతరాష్ట్ర సరిహద్దులోని తెలంగాణ –ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో నిరంతరం పోలీసు ఆపరేషన్స్ కొనసాగుతుందని వెల్లడించారు.

కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల పోలీసు అధికారులతో సమావేశమై శాంతి భద్రతలపై చర్చించానని, వీరంతా చురుకుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. సీపీఎఫ్, గ్రేహౌండ్స్, జిల్లా పోలీసు, ఎస్ఐబీ రాష్ట్రంలోని అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేస్తూ మావోయిస్టుల చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ వెల్లడించారు.

## వేయి స్తంభాల గుడి పునర్నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేయాలి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,అక్టోబర్ 19:వేయి స్తంభాల గుడి పునర్నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్ లో బుధవారం కలెక్టర్, సంబంధిత అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు.

చారిత్రక వరంగల్ కు అత్యంత ఖ్యాతి తెచ్చిన వేయిస్తంభాల గుడి ని తిరిగి అదే స్థాయిలో పునర్నిర్మాణం చేయాలన్నారు. ఇప్పటికే వివిధ సాంకేతిక కారణాలతో జరిగిన ఆలస్యాన్ని ఇక ముందు జరుగకుండా అధిగమించాలని మంత్రి సూచించారు. 2023 మార్చి 31 లోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. వేయి స్తంభాల దేవాలయంతో పాటు వరంగల్ కోట, జైన మందిరాలపై కూడా వారు సమీక్ష నిర్వహించారు.




### చరిత్రలో నేటినిజం



(అక్టోబర్ 20 సిద్ధార్థ శంకరరే జయంతి...)

–రాధశ్రీ
సెల్:9494481210



# ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష!



హైదరాబాద్, అక్టోబర్ 19:ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో పాటు హైదరాబాద్, సైబరాబాద్ సీపీ సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేసీఆర్ చర్చిస్తున్నట్లు సమాచారం. ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న సీఎం కేసీఆర్.. నేరుగా అధికారులతో సమావేశమయ్యారు.

ములాయం సింగ్ యాదవ్ అంత్యక్రియలకు హాజరైన సీఎం కేసీఆర్, అక్కడ్నుంచి నేరుగా ఢిల్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేసీఆర్ పలువురు రైతు సంఘాల నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, పలువురు ఎంపీలతో చర్చలు జరిపారు. బీఆర్ఎస్, టీఆర్ఎస్ కార్యాలయాల పనులను కేసీఆర్ పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖతో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరిపాలన, ప్రభుత్వ పథకాల ప్రచారం, నిధుల సమీకరణపై సీఎస్ సోమేశ్ కుమార్‌తో హస్తినలోనే సీఎం సమీక్షించారు.

# పురపాలక శాఖ అధికారులకు మంత్రి కేటీఆర్ అభినందనలు



హైదరాబాద్, అక్టోబర్ 19:రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను ఆ శాఖ అధికారులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు లభించిన వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డును, లివింగ్ గ్రీన్ ఫర్ ఎకనామిక్ గ్రోత్ అండ్ రికవరీ అవార్డును కేటీఆర్‌కు అధికారులు చూపించారు. అనంతరం పురపాలక శాఖ అధికారులను కేటీఆర్ అభినందించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో అర్బన్ డెవలప్‌మెంట్ చీఫ్ స్పెషల్ సెక్రటరీ అరవింద్ కుమార్ కూడా ఉన్నారు.

పచ్చదనం పెంపుపై వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డుతోపాటు లివింగ్ గ్రీన్ ఫర్ ఎకనమిక్ రికవరీ అండ్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ అవార్డునూ దక్కించుకొన్న విషయం విదితమే. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హార్టికల్చర్ ప్రొడ్యూసర్స్ (ఏఐపీహెచ్) ఆధ్వర్యంలో దక్షిణ కొరియాలో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ నగరానికి వరల్డ్ సిటీ గ్రీన్ అవార్డును ప్రదానం చేశారు.

నగరానికి విశ్వఖ్యాతి రావడానికి సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంతోపాటు పచ్చదనం పెంపునకు తీసుకొన్న చర్యలే ప్రధాన కారణం. భారత్ నుంచి ఈ పురస్కారం అందుకొన్న ఒకే ఒక్క సిటీ మన హైదరాబాద్ కావడం విశేషం. మరో విభాగమైన లివింగ్ గ్రీన్ ఫర్ ఎకనామిక్ రికవరీ అండ్ ఇన్‌క్లూజివ్ గ్రోత్‌లో మరో అవార్డును అందుకొన్నది. నగర వాసులందరూ ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి, అభివృద్ధి చెందడానికి వీలు కల్పించే వ్యవస్థలు, పరిష్కారాలను రూపొందించడంపై ఈ క్యాటగిరీ దృష్టి సారిస్తుంది. తెలంగాణ రాష్ట్రానికి గ్రీన్ నెక్లెస్‌గా పిలిచే ఓఆర్ఆర్ చుట్టూ పచ్చదనం పెంపుతో నగరం ఈ విభాగంలో ఉత్తమమైనదిగా ఎంపికైంది.

# రాజగోపాల్ రెడ్డి గెలిస్తే ఒకరికే లాభం : మంత్రి హరీశ్‌రావు



నల్లగొండ, అక్టోబర్ 19: మునుగోడు నియోజకవర్గం ఉప ఎన్నికలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గెలిస్తే ఒక వ్యక్తిగా అతనికి లాభం అవుతుంది.. అదే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలిస్తే మునుగోడు ప్రజలందరికీ మేలు జరుగుతుంది. ఒక వ్యక్తి గెలవాలా..? మునుగోడు ప్రజలు గెలవాలా..? అన్నది ఆలోచించుకోవాలని మంత్రి హరీశ్‌రావు ఓటర్లకు సూచించారు. మర్రిగూడ మండలం కేంద్రంలో హరీశ్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన 200 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాజగోపాల్ రెడ్డికి ఓటు వేసే ప్రసక్తే లేదని మర్రిగూడ ప్రజలందరూ ముక్తకంఠంతో చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజలను ఒకసారి మోసం చేసిన రాజగోపాల్ రెడ్డికి మళ్ళీ మళ్ళీ మోసం చేసే అవకాశం ప్రజలు ఇవ్వరని తెలిపారు. మునుగోడు ప్రజలకు పాలేందో, నీళ్లు ఏందో అర్థమైందన్నారు. ఇప్పటికే సిలిండర్ ధరలు పెంచిన బీజేపీ సబ్సిడీ సిలిండర్లు సంవత్సరానికి మూడు మాత్రమే ఇవ్వబోతున్నామని ప్రకటించింది. ట్యాంకర్లతో నీళ్లు మోసుకొని ఎంత బాధ పడ్డామో మునుగోడు ప్రజలు గుర్తు తెచ్చుకోవాలి. ఫ్లోరైడ్ బాధతో అంగవైకల్యం కలిగిన బాధితులు ఇంకా మన కళ్ళముందే ఉన్నారు. నల్గొండకు ఫ్లోరైడ్ సమస్యను తీర్చిన కేసీఆర్ రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### బీజేపీపై ప్రశ్నల వర్షం..

అన్ని వర్గాలను కడుపులో పెట్టుకొని చూసుకునే టీఆర్ఎస్ పార్టీ వృద్ధులకు రూ. 2000 పెన్షన్ ఇస్తుంది. ఇందులో ఢిల్లీ బీజేపీది ఒక్క రూపాయి ఉందా అని అడుగుతున్నాను. పేద ఆడబిడ్డ పెళ్లయితే రూ. లక్ష ఇస్తున్నాం. ఇందులో బీజేపీది రూపాయి ఉందా అని అడుగుతన్నాను. రైతుబంధు, రైతు బీమాలో మీ రూపాయి ఉందా అని బీజేపీని అడుగుతున్నాను అని హరీశ్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికలు అయిపోగానే ఢిల్లీ పార్టీ నాయకులు అక్కడికే లైన్ కట్టి వెళ్ళిపోతారు. ఇక్కడ ఉండేది కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ మాత్రమే. మన పార్టీని గెలిపించుకుంటే మునుగోడు అభివృద్ధి చెందుతుంది. మీ కళ్ళ ముందే ఉండే టీఆర్ఎస్ పార్టీ కావాలా..? ఎక్కడో ఢిల్లీలో ఉండే బీజేపీ కావాలా..? అనేది మునుగోడు ప్రజలు ఆలోచించాలన్నారు.

### మర్రిగూడెం అభివృద్ధి నా బాధ్యత..

ఈ మర్రిగూడెం అభివృద్ధి నా బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మూడు నెలలకు ఒకసారి వచ్చి సంవత్సరంలో మర్రిగూడను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ నడి మంత్రం ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డి గెలిచి చేసేదేమీ లేదు. మళ్ళీ సంవత్సరం అయితే ఎన్నికలు వస్తాయి. ఇప్పుడు మమ్మల్ని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం. మళ్ళీ ఎన్నికలు వచ్చినప్పుడు ఈ అభివృద్ధి తోనే మీ ముందుకు ఓటు అడగడానికి వస్తామని హరీశ్‌రావు చెప్పారు.

# విశ్వజనీనం.. నిత్య నూతనం వారి సాహిత్యం


గురజాడ అప్పారావు గుర్రం జాషువా వట్టికోట ఆళ్వార్‌స్వామి వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారైనప్పటికీ, వారి సాహిత్యం విశ్వజనీనం, నిత్య నూతనమని వేంకటేశ్వరవర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఇనాక్.

త్యాగరాయ గానసభలో మంగళశారం గురజాడ, జాషువా, ఆళ్వార్ స్వామీల జయంత్యుత్సవం జరిగింది. తెలుగు భాషా చైతన్య సమితి, తెలంగాణ రచయితల సంఘం, అక్షర కౌముది, పాలడుగు కళాపీఠ్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ ఇనాక్ మాట్లాడుతూ తెలుగుజాతి నిత్యమూ స్మరించదగ్గ మహనీయులు గురజాడ, జాషువా, ఆళ్వార్ స్వామియని పేర్కొన్నారు. బడేసాబ్ అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ గురజాడ సాహిత్యంపైన కవి డాక్టర్ నాళేశ్వరం శంకరం ఆళ్వార్‌స్వామి సాహిత్యంపైన ఇనాక్ జాషువా సాహిత్యంపైన ప్రత్యేక ప్రసంగాలు చేశారు. విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి, సరోజినీదేవి, చంద్రప్రకాష్‌రెడ్డి సభలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ, అక్టోబర్ 19: సోనియా గాంధీ స్థానంలో కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టబోయేది ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా మల్లికార్జున ఖర్గే ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో ఎంపీ శశిథరూర్‌పై ఆయన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఖర్గేకు 7,897 ఓట్లు రాగా, శశిథరూర్‌కు వెయ్యి ఓట్లు వచ్చాయి. మరో 416 ఓట్లు అనర్హతకు గురయ్యాయి. ఈనెల 17న ఎన్నికలు జరగ్గా ఇవాళ ఓట్ల లెక్కింపు చేపట్టారు.

137 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ చరిత్రలో అధ్యక్ష పదవికి ఆరుసార్లు మాత్రమే ఎన్నిక జరగడం విశేషం. ఈ ఎన్నికల్లో పార్టీ సీనియర్ నేతలు శశి థరూర్, మల్లిఖార్జున ఖర్గే పోటీపడ్డారు. అయితే, ఈ ఎన్నికల్లో ఖర్గే విజయం సాధించి పార్టీ పగ్గాలు చేపట్టబోతున్నారు.

## టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి కొప్పుల ఈశ్వర్

చండూరు , అక్టోబర్ 19: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి ఈశ్వర్ అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా చండూరు మండలం శిర్దేపల్లి, తాస్కానిగూడెంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన పాలనను అందిస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలుపెంచిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎత్తి వేసేందుకు కుట్రలు చేస్తుందని బీజేపీపై మండిపడ్డారు. పల్లె ప్రగతి, రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు వంటి పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. రాజగోపాల్‌రెడ్డి గడిచిన నాలుగేండ్లుగా నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం వల్ల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు నిలిచిపోయాయని ఆరోపించారు.

# మహా కవి కాళోజీ ఉవాచ



**"పుటక నీది
చావు నీది
బతుకంతా
దేశానిది''** ఎంతోమంది త్యాగవీరులకు ఖచ్చితంగా వర్తిస్తాయి పై పదాలు. అలాంటి వారి కొన్ని జీవితాలను తన పేజీల లో నిక్షిప్తపరచడం విస్మరించిన 'చరిత్ర' నేటికీ విలపిస్తున్నది. తన జీవితమంతా నిజాం సర్కారు కుచ్చిత పాలనను వ్యతిరేకించి పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్న అతి కొద్దిమంది పాత్రికేయయోధులలో షోయబుల్లా ఖాన్ ఒకడు. ఈయన జననం 1920 సంవత్సరం అక్టోబర్ 17న ఖమ్మం జిల్లాకు చెందిన సుబ్రవేడు లో జరిగింది. తండ్రి హబీబుల్లాఖాన్ రైల్వే పోలీసు, తల్లి లాయహున్నీసా బేగం. ప్రాథమిక విద్య స్థానికంగా జరిగినా ఉన్నత చదువులు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగింది. జర్నలిజం కోర్స్ కూడా అక్కడే చేశాడు.ఆ తరువాత ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్షను బొంబాయిలో పూర్తి చేశాడు. షోయబుల్లా మంచి చిత్రకారుడు కూడా. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ పెద్ద 'పొట్రాయిట్' వేసి తన గదిలో జీవితాంతమూ వుంచుకొన్నాడు. 1920లో జాతీయోద్యమం విరివిగా దేశవ్యాప్తంగా సాగుతున్న రోజుల్లో మహాత్మాగాంధీ పర్యటన లో భాగంగా మహబూబాబాద్ రైల్వేస్టేషన్ లో కొంత సేపు ఆగాల్సివచ్చిన సమయంలో డ్యూటీ లో వున్న షోయబుల్లా తండ్రి హబీబుల్లాఖాన్ మహాత్ముని అతి సమీపంలో చూసే భాగ్యం కలిగింది. అదే రోజు సాయంకాలం ఇంటికి చేరుకున్న హబీబుల్లాఖాన్ కు బిడ్డ పుట్టడం, అతనికి గాంధీ ముఖ కవలికలు వుండడం చూసి ఆనందపరవశుడై తన బిడ్డ మహాత్ముడంతటివాడు ఔతాడని వాడిని షోయబుల్లా గాంధీ అని పిలిచేవాడు. తండ్రి ఊహలు నిజం చేస్తూ అనేక ప్రోగ్రెసివ్ ఉద్యమాలలో పాల్గొన్నాడు. మెండి పట్టుదల , కార్యసాదనాతీవ్రత, ,కమశిక్షణ అతనిని ముందుకు సాగనంపింది. సాహిత్యం జర్న లిజం అంటే మహా ఇష్టంగా వున్న షోయబుల్లా ఖాన్ కు ఎన్నో అవకాశాలు వచ్చినా పత్రికారంగం వైపుకే దారి మళ్ళించాయి. షోయబుల్లా గొప్ప తాత్విక దృష్టి గలవాడు. దేన్నీ గుడ్డిగా నమ్మేవాడు కాదు అందుకే 'స్టాలిన్ నియంతృత్వాన్ని తీవ్రంగా విమర్శించేవాడు. ప్రజాదరణ లేని సోషలిజం దేనికీ పనికి రాదనే వాడు యమ్.యన్. రాయ్ రాడికల్ హ్యూమనిస్ట్ పత్రిక 'తినిటవజూవనిటవనిబి తినిటతిజీ' ను అధ్యయనం చేస్తూ అందరికీ పంచి చదివించే వాడు. సైద్ధాంతిక చర్చల్లో పాల్గొని అనవసర ప్రసంగం చేయకుండా నిలకడగా ప్రవర్తించేవాడని అతని సమకాలికులనేవారు. జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులు గడించిన 'అక్బార్' పత్రికా సంపాదకుడు మౌల్వీ మహమ్మద్ బాకర్ తన త్యాగంతో 1857 లో చరిత్రను సృష్టించారు. అతని ఆదర్శాలకు ప్రభావితుడై అక్షరాలను ఆయుధాలుగా మార్చుకొని చివరి శ్వాస వరకు పోరాడిన హైదరాబాద్ యోధుడు షోయబ్ ఉల్లాఖాన్. రచనా వ్యాసంగం 'తాజ్వీ' పత్రిక తో ప్రారంభించి నిజాం పాలనలో

> **"చావు అనివార్యం. అది దేశం కోసం, పీడిత జనం కోసమయితే అంతకన్నా అదృష్టం ఏముంది"**

జరుగుతున్న అన్యాయాలను బహిరంగంగా దుయ్యబట్టాడు షోయబుల్లా. ఆ కారణంగా నిజాం సర్కారు ఆగ్రహానికి గురియై అనతికాలంలోనే ఆ పత్రిక నిషేధించబడింది. అప్పట్లో ప్రముఖ కాంగ్రెసు నాయకుడు మందుముల నరసింగరావు దృష్టి షోయబుల్లాఖాన్ పైబడి తన పత్రిక' 'రయ్యత్' కు ఆహ్వానించి ఉప సంపాదకత్వాన్ని అందించారు. అప్పటికే తెలంగాణా సాయుధపోరాటం ఊపందుకొన్న కారణంగా నిజాం ఆగడాలు మితిమీరి పోతున్నాయి. పైగా రజాకార్లు అనే ప్రయివేటు సైన్యాన్ని తయారు చేసిన ఖాశీంరజ్వీ దురాగతాలకు ఎదురు లేకుండా పోయింది. ఆ సమయంలో షోయబుల్లాఖాన్ విజృంభణ మరింత తీవ్రతరం చేసి ఆ వార్తలను ఎప్పటికప్పుడు ఆయుధాలుగా మలచి ప్రజలకు అందిస్తూ నిజాంకు, రజాకార్ల కు కంటకంగా మారాడు. ఆ విధంగా నిజాం పాలనను విధానపరంగా అడ్డుకున్నందుకు 'రయ్యత్' పత్రికను కూడా నిషేదించారు. ఇక వేరే మార్గం లేక సొంత పత్రిక ను నడపాలన్న ఉద్దేశముతో తన తల్లి, భార్య నగలను అమ్మి 'ఇమ్రోజ్' పత్రిక ను స్థాపించాడు. బూర్గుల రామక్రిష్టారావు సహాయంతో తొలి సంచిక 1947 నవంబర్ 17న వెలువడింది. అప్పట్లో భారత యూనియన్ లో విలీనం కావడానికి అంగీకరించని సంస్థానాలలో ప్రదమమైనది హైదరాబాద్. పాకిస్థాన్ ను సమర్థిస్తూ కోట్ల రూపాయలు విరాళంగా కూడా ఇచ్చాడు నిజాం నవాబు. ఈ విషయాన్ని ప్రజలకు చేరవేయడంలో ప్రముఖపాత్ర పోషించింది షోయబుల్లా ఖాన్ ఇమ్రోజ్ పత్రికే. పైగా హైదరాబాద్ భారతదేశం లో విలీనం కావాలన్నది ఆయన జీవితాశయం. అందుకోసం అహర్నిశలూ పోరాడుతూ దొరికిన అవకాశాలను ఏ ఒక్కటీ వదలక నిజాం , ఖాశీరజ్వీ ల అఘాయిత్యాలను ఎప్పటికప్పుడు వార్తలుగా ప్రజలకు ఊరూర అందజేసే వాడు షోయబ్. ఆ తరుణంలో నిజాం సర్కార్ దేశం లో విలీనం కావాలని డిమాండ్ చేస్తూ ఏడుగురు ముస్లిమ్ పెద్దలు నిజాం కు వినతిపత్రం సమర్పించారు. ఆ పత్రాన్ని ప్రచురించడానికి భయపడి ఏ పత్రిక ముందుకు రాలేదు. కానీ పత్రాన్ని వున్నదున్నట్లు షోయబుల్లా తన ఇమ్రోజ్ పత్రిక లో నిర్భయంగా ప్రచురించి నిజాం ఆగ్రహానికి గురైనాడు. ఈ వార్త బారత ప్రభుత్వానికి తెలిసి విలీనానికి ఐక్యరాజ్య సమితి లో పెడతారని నిజాం చాలా భయపడ్డాడు. అప్పటినుండి నిజాం కన్ను నేరుగా షోయబుల్లా ఖాన్ మీద పడింది. దీని ఫలితంగా 1948 ఆగస్ట్ 19 నాడు హైదరాబాద్ జమురుద్ సినిమాహాలు లో జరిగిన సభలో ఖాశీం రజ్వీ తమకు వ్యతిరేకం గా వార్తలు రాసిన వానికి చేతులు వుండవని బహిరంగంగా హెచ్చరించాడు. హెచ్చరిక ప్రకారమే రెండు రోజులకే అంటే 1948 ఆగస్ట్ 21వ తేదీ అర్ధరాత్రి అటాక్ చేసి కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతంలో షోయబుల్లాఖాన్ ను దారుణంగా చేతులు నరికి హత్య చేశారు . ఆ సాయంత్రం ఉస్మానియా హాస్పిటల్లో కళ్ళు తెరచి చివరిగా అన్న మాటలు ---- "చావు అనివార్యం. అది దేశం కోసం, పీడిత జనం కోసమయితే అంతకన్నా అదృష్టం ఏముంది" అన్నారు. జాతి విముక్తి కోసం సాగిన పోరాటాలలో అన్ని వర్గాల ప్రజలతో పాటు కలం యోధులు, సంపాదకులు, పాత్రికేయులు ఎందరో ఆంక్షలను నిర్భంధాలకు బలియైనారు. వారిని చరిత్ర మరచి పోవడం క్షమార్హం కాదు. ప్రజల గుండెలలో పొదిగినవారిలో ప్రముఖుడైన అక్షర యోధుడు షోయబ్ ఉల్లాఖాన్ కు సహ పాత్రికేయులు ఇచ్చే నివాళి ఒక్కటే 'ఉత్తమ ప్రమాణాలు కలిగిన నిర్భయ నిజాలు '.

*( షోయబుల్లాఖాన్ జయంతి అక్టోబర్ 17 సందర్భంగా)*


–మాయకుంట్ల
నారాయణరెడ్డి
9989686603



పుస్తక సమీక్ష

# లోపలి తత్వాన్ని వ్యక్తీకరించిన వ్యాసాలు "నిశిత"

"నిశిత" గ్రంథంలో ఇరవై వ్యాసాలున్నాయి. అనేక మంది లబ్ధ ప్రతిష్టులైన సాహితీ వేత్తలు, కవుల గురించిన, వారి రచనల గురించిన విషయాలు, వస్తువు, శిల్పం, అభివ్యక్తీకరణ వంటి కీలకమైన విషయాలను వ్యాసాలుగా రచించారు. ఈ గ్రంథంలో ప్రఖ్యాత కవులు ఆరుద్ర నుండి స్త్రీవాదం వరకు అనేక వ్యాసాలున్నాయి. కవిత్వంలో కాలం, సమాజ సౌందర్యం, ఆత్మగౌరవం, తెలుగు మాండలికాలు, సినారె ప్రపంచ నదులు, విమర్శకుని బాట, భాషా సౌందర్యం. తెలుగు కథానిక వికాసం, సామాజిక తలంపై గణిత సామాన్యాల విన్యాసం, రామాయణ మహాభారతాలలో ఉండే మానవతా విలువలు, భారతీయ సాహిత్యంలో సృష్టి పరిణామ క్రమం, సాహిత్యంలో మార్క్సిస్టు ఆలోచనలు, సాహిత్యంలో ప్రాపంచిక దృక్పథం, ప్రపంచీకరణ, భారతీయ సంస్కృతిలో కలిసిపోయిన ఇతర మతాల పండుగలు వంటి వ్యాసాలతో ఈ గ్రంథం ఎంతో ఆసక్తికరంగా సాగింది.



నిజమే. చాలా మందికి ఇప్పటికీ ఆధునికాలకు ప్రాచీనుల సాహిత్యం, వాటి తాలూకు సౌందర్యం తెలియదు. ముందుమాటలో వీరంటారు. సింగమనేని నారాయణ, తెలకపల్లి రవి, కాత్యాయని విద్మహే, కె.శివారెడ్డి, పాపినేని శివశంకర్, ఓల్గా వంటి వారి రచనలు చదివిన తర్వాతనే తనకు ఇటువంటి వ్యాసాలు రాయాలని అనిపించిందని. కాకుంటే అనేక విమర్శనా గ్రంథాల కంటే వీరి వ్యాస రచన వారికి భిన్నంగా సాగింది. సమాజం, సాహిత్యం, చరిత్ర, సైన్స్ వంటి నాలుగూ కలగలిపి ఒక రచన సాగటం అనేది సరికొత్తదనమే కదా!

కుమారస్వామి గారు రచించిన వ్యాసాల సంపుటులలో ఇది రెండవది. తొలుత వీరి కలం నుండి 'విశద' అనే వ్యాసాల సంకలనం వెలువడింది. అధ్యయనం వల్ల రచయితలకు ఎంతో మేలు జరుగుతుంది అనే వీరి మాటల్లో ఎంతో నిజం ఉంది, అది అనుకరణకు పోనంతవరకు మాత్రమే. "భారతీయ సాహిత్యంలో సృష్టి పరిణామం' అనే వ్యాసంలో మౌలిక చింతన కనిపిస్తుంది. అలాగే 'సాహిత్యంలో శాస్త్రీయ భావనలు' వ్యాసం ఆధునికతకు అద్దం పడుతుంది. 'తెలుగులో మాండలికాల నిఘంటువు రావాలి' అనే వ్యాసంలో ప్రాంతాల వారిగా వారి భాషలోని తీయదనాన్ని వివరించారు. 'రామాయణ మహాభారతాలు -మానవ విలువలు' వ్యాసంలో విమర్శకునికి సాహిత్య అధ్యయనంలో పెద్దగా వివరించాల్సిన పద్ధతులు లేవని తెలియజేస్తారు. 'సాహిత్యంలో మార్క్సిస్టు ఆలోచనా విధానం' వ్యాసం పూర్తిగా తాత్త్వికత కనిపిస్తుంది. అలాగే సినారే ప్రపంచ నదులు' పై విశ్లేషణ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. సినారె కవితా పంక్తుల్ని వివరించిన తీరులో కొత్తదనం ఉంది. కాలాన్ని గురించిన వ్యాసాన్ని వివరించదలిచితే తెలుగు కవులు కాలాన్ని ఏ విధంగా సంబోధించారో వివరించబడింది. ఊహ అనేది విమర్శకునికి తగదు. వాస్తవాల వంతెనపై వేల్లాడే భావాలే విమర్శగా నిలబడుతుంది అనడానికి "సమాజంలో సౌందర్యం' వ్యాసం ఉదాహరణ. వీటితో పాటుగా 'ఆత్మగౌరవ కవితా గానం' వ్యాసంలో మార్క్సీయ విమర్శకులు ప్రగతిశల సాహిత్య సామాజిక వాదాలను గౌరవిస్తారని తెలియజేసారు. స్త్రీవాదం పరిశీలన' వ్యాసం విపులంగా రచించారు కానీ స్త్రీ వాదం ఎప్పటికీ ఒక ధోరణి కాదు. జరిగినా జరగక పోయినా ఎప్పటికీ ఉద్యమమే. స్త్రీ, తనంతట తాను మాట్లాడటం మొదలుపెట్టినప్పటి నుండే ఉద్యమం ప్రారంభమైంది. తన బాధను తాను నిర్మొహమాటంగా, నిజాయితీగా బయటకు చెప్పుకున్నపుడు మరింత బలపడింది. ఈ రోజు తనకేం కావాలో అది సంపాదించుకుంటున్నప్పుడు తనతో పాటు ప్రయాణం చేస్తోంది. ఇందులో ధనిక, పేదల వ్యత్యాసం ఏమీ లేదు అనేది నా ఉద్దేశ్యం.

ముఖ్యంగా 'నవ్వు' వ్యాసంలో నవ్వుకున్న శాస్త్రీయ పునాదిని తెలియజేస్తూ నవ్వును కవిత్వానికి అన్వయించిన తీరు ఆకర్షణీయంగా నిలిచింది. సామాజిక తలంపై గణిత సాహిత్యాలు మేలు కలయికల విన్యాసం నేటి విద్యార్థులకే కాదు సాహితీ మేధావులకు కూడా ఎంతో అవసరం అయితే ఈవ్యాసం గణితంలో ప్రావీణ్యత ఉన్నవారే రాయగలరు అనిపిస్తుంది. 'తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల మీద ప్రపంచీకరణ' అనే అంశాన్ని చర్చించిన తీరు బావుంది. అసలు మార్క్సిస్టు ప్రపంచీకరణను ఆమోదించరు. అయినా ఈ రచయిత ప్రపంచీకరణ-పరాయీకరణ ను గురించి ప్రస్తావిస్తూ "ప్రపంచీ కరణ మూలంగా సమాజం ఎన్ని ముక్కలవ్వాలో అన్ని ముక్కలైంది" అని తెలిపిన తీరు ఎంతో విలువైనదిగా అనిపించింది. భారతీయ సమాజంలో భిన్నత్వాన్ని ప్రపంచీకరణ పెడదోవ పెట్టిన తీరును ఎంతో చక్కగా విశదీకరించారు. 'భారతీయ సంస్కృతిలో మిళితమైన రంజాన్ పండుగ' వ్యాసం ఎంతో హృద్యంగా నిలిచింది. ఈ గ్రంథం శీర్షిక "నిశిత" పేరుకు తగినట్లే వీరి వ్యాసాలలో నిశిత పరిశీలన ఉంది. నేడు తెలుగు సాహిత్యంలో విమర్శకుల కొరత ఉంది. విమర్శలో సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారి ముందు మాట ఈ గ్రంథానికి మరింత శోభను చేకూర్చింది. వారి అనంతరం వచ్చిన అనేక మంది రాయలసీమ విమర్శకులలో కుమారస్వామి కూడా ఒకరుగా నిలుస్తారు అనడంలో అతిశయోక్తి లేదు. ఇటువంటి మరిన్ని గ్రంథాలు రచించాలని కోరుతూ రచయిత కుమారస్వామికి నా అభినందనలు.

**ప్రతులకు:**
పిళ్ళా కుమారస్వామి
ఫోన్: 9490122229



-శైలజామిత్ర
9290900879

## కవుల కాసారము

బయటేమో కుండపోత
లోపలేమో రసఝురుల మోత
కవుల కువకువల ధ్వనులు
రస మధురిమలు రాగ రంజితాలు
ఏరులై పారుతున్న కవితా గానాలు
రసాలనునినీపు కుంటున్న కవితా కాసారాలు
హంసలవలె ఈదుతున్న కవుల సమూహాలు
ఒక్కరొక్కరుగా చేరుతున్న కవి పండితులు
వేధిక నలంకరించిన విధ్యావేత్తలు
సభను రంజింపచేస్తున్న ప్రసనీగాలు
విహంగాల్లా రెక్కల్లా విచ్చుకుంటున్న కొత్త పుస్తకాలు
హాలంతా విస్తరిస్తున్న సాహిత్య పరిమళాలు
సీత మాటల ఛిద్విలాసాలు
భావధర్పణం కనుమిట్ల కాంతులు
ధర్పణంలో ప్రతిబింభిస్తున్న కవుల కవితలు
రస మధురిమలు చతుర సంభాషణలు
సమయపాలనలు సభలో సువాసనలు
మధ్య మధ్య సన్మానాల సంబరాలు
కెమెరాల తలుక్కులు ముఖాలలో చమక్కులు
ఒకదాని వెంబడిగా
ముగుస్తు మళ్ళీ మొదలయ్యే సభలు
సాయంకాలం వరకు సాగిన సంభరాలు
బయట మబ్బుల చాటున సూరీడు కనపడడు
కానీ కాంతులతో విరజిమ్ముతూ
రెండు సూరిల్లు లోపల కనిపిస్తారు
ఒకటి సూర్య ప్రకాశం రెండు నేటి నిజ తేజం
కవులను తయారు చేస్తున్న కర్మాగారం
మేడ్చల్ మల్కాజిగిరి భావ కవుల ధర్పణం



-కందుకూరి మనోహర్
9908231588


## అడవిబిడ్డలు ఆదివాసీలు

ఏండ్లు గడిచినా
ఎంత అభివృద్ధి చెందినా
చట్టాలు తెచ్చినా
సమూల మార్పులు చేసినా
వీడకున్నరు అడవితల్లిని..!
వీడనన్నరు కన్నతల్లిని..!!

తూట్లు పొడిచినా
తుటాలు దించినా
బాధలకు గురిచేసినా
బెదిరింపులు పెట్టినా
పారిపోకున్నరు తల్లి ఒడినా..!
కాపాడుకుంటున్నరు కన్నతల్లిలా..!!

జంతువులతో జీవనము
జాగ్రత్తగనే పయనము
జీవనభృతియే వనము
జీవగంజీయే ఆరణ్యము
జారుకోకున్నరు గిరిజనులు..!
జాగ్రత్తగా ఉంచుతున్నరు ఆదివాసీలు..!!

కల్మషమెరుగని కష్టజీవులు
అహంకారంలేని అమాయకులు
సాయంచేసేటి సేవకులు
ఆత్యాశుండని ఆత్మీయులు
అడవి బిడ్డలేరా ఆదివాసులు..!
మన్నెందొరలు కదరా మట్టిబిడ్డలు..!!



-పసుల. శంకర్
9542181301

## గజల్

కన్నవారి ఉన్నతికోసం..తపించేవాడు నాన్నంటే
కలనైనా బిడ్డలకోసం..యోచించేవాడు నాన్నంటే

బడబాగ్ని తనలోవున్నా..చల్లని సంద్రంలా వుంటాడు
బాధలెన్నో తనలోవున్నా..దాచేసేవాడు నాన్నంటే

తనపిల్లల సౌఖ్యం కోసం..కొండనైనా పిండిచేస్తాడు
పిల్లల సంతోషమే స్వర్గమనీ..తలచేవాడు నాన్నంటే

నీ భవితకై నిరంతర తపన..నిను శిఖరానికి చేర్చేనిచ్చెన
నీకోసం తన ఆయువునైనా..ఇచ్చేవాడు నాన్నంటే

ఇంటికోసం సర్వస్వము..ధారపోసే త్యాగధనుడు
క్రొవ్వొత్తిలా దేవా వెలుగునిచ్చి..కరిగేవాడు నాన్నంటే



– బూర దేవానందం
8143589789

## ప్రేమంటే

మనసు మనసు మమేకమైన అనుభూతి
గుండెపూదోటలో వికసించిన అలౌకికస్థితి
ఎన్నోభావాల కలబోత కలల అక్షరాకృతి
అనంతమైన అనిర్వచనీయమైన ఆకృతి
ఆది అంతంలేని అద్వితీయమైన భావనాజ్యోతి
మదిలోని మాటలను తెలియజేసే రాగశృతి
అమ్మ నాన్న భార్య భర్త మధ్యన నిలిచి తలిచే
మౌనమంత్ర రూపమే ప్రేమంటే
అనుబంధాల మధ్య అనురాగం
అనుభవాల మధ్య కమ్మనిభావం
హృదయస్పర్శలో నిలిచే నిర్మలదామం
రెండు మనషులకు వారధివలె
నిండు మనసులకు సారధివలె
ఆకాశపు గొడుగువలె
సముద్రంలోని అలలవలె
అరమరికలు లేనిది ప్రేమంటే
ఆనంతంగా హాయిగా సాగే
రెండు మనసుల కలయిక
అంక్షలు లేనిది కాంక్షలు తెలియనిది
దాపరికాలు కలతలు ఎరుగనిది
మదిలోని మధుర లయలను
కష్టాలలోని కన్నీటి జడులను
చిరునవ్వె విరబూసే చిరుదివ్వెలను
మనసు మనసు మధ్యన తలిచే
ప్రణయ సుగంధ ప్రతీక ప్రేమంటే



-డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

## మధ్యతరగతి బ్రతుకులు

జీతం జీవితానికి ఆధారం
జీవితం మనుగడకు మూలస్థంభం!


ఆదాయముంటేనే వ్యయాలకు ఆలంబన
స్థిరమైన వేతనంతోనే ఇంటిల్లిపాదికీ
లభ్యమగు సుఖం,సంతోషం!

పనికి తగిన వేతనం
పొందని నిర్భాగ్యులు కొందరు...
జీవితాంతం జీతం లేని
పనిమనుషులు మరికొందరు!

ఒక్కని జీతంతో పదిమంది
బ్రతికే రోజులు పోయి...
పెరిగిన ధరలు,నిత్యావసర
సౌకర్యాలకు వ్యయాలతో...
తలకు మించిన రుణాలతో...
ప్రతిదానికీ పన్ను భారంతో...
ఇరువురు నెలంతా కష్టపడినా...
నలుగురు కుటుంబ సభ్యులకు
నెల గడవడం గగనమయ్యే రోజులాయె!

వివిధ ప్రభుత్వ పథకాలతో
దిగువ తరగతి ప్రజలకు లేదు చింత...
తరతరాలకూ తరగని సంపదతో
ఎగువ తరగతి ప్రజలకు నిశ్చింత!


అరకొర జీతాలతో...
అరవ చాకిరీతో...
అత్తెసర్లో మరిగేవి
మధ్యతరగతి బ్రతుకులే!



-చంద్రకళ. దీకొండ
చరవాణి:9381361384

## రూపాయి

బతుకు చిద్రం చేసిన
బతుకు నిలబెట్టిన
ఒక్క రూపాయి
పతనం అంచు చూసిన
ప్రాముఖ్యత పెంచిన
ఒక్క రూపాయి
గూడు కావాలన్న
నీడ దొరకాలన్న
నిన్ను నిన్నుగా చూడాలన్న
ఆ ఒక్క రూపాయి
ఒక్క రూపాయి అని
చులకన చేయకు
అది సాధించే విజయం చూడు
కనులు తెరిచి చూడు.



-పి.విశాలాక్షి
9908435805

## తెగింపుల పౌరుషం

మాతృభూమి రక్షణకై మమకారపు సేవగణం
దేహాన్ని అడ్డుపెట్టే కుటుంబాల శీలధనం...!
జన్మభూమిపై ప్రేమ వాత్సల్యమే త్యాగగుణం
జవానులకే చెల్లుతుంది సైనికులదే పేటేంటు....!

విద్యార్థి ఫెయిలెపుడు వ్యాపారి లాసునెపుడు
గెలుపాశే క్రీడలకు మైదానమే మలుపు గెలుపు...!
ఫెయిలైనా ఓటమైనా జీవితమే మిగులుతుంది ..!
కానీ...
నిలబడేటి కదనరంగ కలబడేటి యుద్ధరంగ
ఫిరంగుల ప్రాణాలతో చెలగాటం పోరాటం
ఆరాటం సైనికులకు త్రిగుణశక్తి స్వీకరణం
జవానుగుండె సంకల్పం తెగింపుల పౌరుషము
ఓటమెరుగని దైర్యం చోటేదైనా స్థైర్యం....

క్షణంక్షణం కణంకణం భరతసేవే భవితవ్యం..
బార్డర్లో సైనికుడై శ్వాస ధ్యాస ప్రతి పాదం..
సార్వభౌమ రక్షణమే రుధిరధార మా లక్ష్యం..
దేశ తిలకమాభరణం దేశ ప్రజలే మా బలం...!

అసువుల ఆశయమంతా ఆత్మనివేదన జ్యోతిగ
అశ్రునయన జలకళలే హారతిగా భారతిగా
మువ్వన్నెల రెపరెపలే అప్రమత్త ఆచరణగ
ఆత్మీయతే గౌరవంగ అంతిమ యాత్రలో తోడుగ
అలుముకున్న జాతీయత సమున్నత సంపన్నత..!
మంచుకొండ చరియల్లో శీతలగాలుల చలిలో
కర్మయోగ పహారంగ కవాత్తుల విహారంగ
అహర్నిశలు సరిహద్దులో ఉగ్రవాద దాడులెన్నో
గుంటనక్క ఉపాయాల్ని అపాయాల ఆత్మస్థైర్య
నిర్భరత్వ నిఖార్సయిన కార్యతత్వ ధీరయోధ
జై జవాన్ జై కిసాన్ జై విజ్ఞాన్ నినాదాలే..
నేలకొరగలేదుమీరు నింగి కెగియలేదు మీరు
కోట్లహృదిలో కోర్కెదీర్చె కొలువైన
సురలు మీరు
జాతిరత్నములుమీరు భరతమాత వరపుత్రులు
కవికలాల హృదిరాతల గీతలరాగం మీరు...!

మీ పాదచరణాలను కన్నీటితో తడుపుతాము...
మూసిన మీ కన్నులే మా కర్తవ్యపు జేజేలు
దేశ బాధ్యతా గుణనిధులు మా గుండెల యశోధనులు ...!



-డా.పాండాల మహేశ్వర్
9912180054

## ఒంటరితనం

ఈ అనంత విశ్వంలో
జీవన శైలి అంతా నాటకం,
మంచితనం ఒక బూటకం..

ప్రేమ అనేది కల్తీ మయం,
ఆత్మీయత ఆమడదూరం...
అర్థం చేసుకోలేని బంధం,
పెనవేసుకోలేని అనుబంధం..

అవసరానికి కానరానిస్నేహం,
దేనికి అక్కరకు రాని చుట్టం..
సంపద గలవాడికే ప్రాధాన్యం,
అది లేని వానికి అంతా దూరం..

అర్థం చేసుకోలేని బంధాలు
ప్రేమ ఆప్యాయత లేని అనుబంధాలు.,
కష్టమో, నష్టమో వస్తే నీవెనక
ఎవరో నడుస్తారు అన్న నమ్మకం లేదు..
బాదో, దుఃఖమో వస్తే నిన్ను
ఎవరో వోదారుస్తారు అన్న భరోసా లేదు!

కల్మషమైన మనసుల మధ్య నలగడం నష్టం,
అందుకే, నాకు ఒంటరిగా మెలగడమే ఇష్టం!
ఈ నకిలీ మనుషుల మధ్య బ్రతకడం కష్టం,
అందుకే నాకు ఒంటరితనమే ఇష్టం..!!



-ఎన్.. రాజేష్
9849335757

## వందేమాతరం

ముప్పాతిక వసంతాల చరితగల దేశం
విశ్వగురువు కీర్తితో
విలసిల్లిన శుభ తరుణం....

అంకెలలో శూన్యం,
ఆరోగ్యానికి ఆయుర్వేదం,
మానవాళికి బౌద్ధం,
ఆటలలో చదరంగం...
లోకానికి అంకితమిచ్చిన
ఘనమైన గత వైభవం...

సాంప్రదాయ నెలవు,
సర్వశ్రేష్ఠ సంస్కృతి,
సకల మత సమ్మేళనం,
పటిష్ఠ వివాహ వ్యవస్థ...

ఆత్మీయతను రంగరించి రుచిచూపిన జాతి,
యోగాతో దశదిశలకు వ్యాప్తి చెందిన ఖ్యాతి...
నాగరికతకు నవీనతను నేర్పిన నేల,
త్రివర్ణ పతాకపు రెపరెపల్ని చూసిన వేళ,
పురాతన సంపదలకు పుట్టినింటి మట్టిని,
ముద్దాడిన క్షణం....
జాతికై అమరులైన వీరులను తలవగానే,
ఛాతి గర్వంగా బిగుసుకుంటూ...
గుండెలోంచి ఓ శబ్దం
ఎదను చీల్చి దూసుకొస్తుంది...
ఆ నినాదం వినగానే రోమాలు సైతం
గౌరవార్థం లేచి నిలబడి సెల్యూట్ చేస్తాయి....
అదే వందేమాతరం.... వందేమాతరం

-ఎన్. లహరి
9885535506

## చిరంజీవులు

దేశానికి ప్రాణమిచ్చి
దేహాన్ని లెక్కచేయని చరిత్ర మీది
మీ త్యాగాలను
ఏ తూనికరాళ్ళతో కొలవగలం ?

దేహమొక్కటే
ప్రాణమూ ఒక్కటే ఎవ్వరికైనా
బంధాలూ
అనుబంధాలతో సాగే బతుకుబండే ఎవరిదైనా
తీగల్లా అల్లుకున్న బంధాలనొదిలి
ప్రాణాల్ని గాలిపటాల్లా పైకెగరేయడం
నీకంటూ గుర్తింపునిచ్చిన దేహాన్ని
మాతృభూమి మట్టిలోనే కలిపేయడం
మీకుతప్ప ఇంకెవరికి చెల్లు.

మీరెప్పుడూ చెరగని జ్ఞాపకమే
మీరెప్పటికీ స్ఫూర్తి ప్రదాతలే
మీరు తెచ్చిన స్వాతంత్ర్యపు వెలుగులో
దేశమిప్పుడు దారివెతుక్కుంటుంది
మీరిచ్చిన స్ఫూర్తితోనే
దేశమిప్పుడు నడకనేర్చుకుంటుంది
మీరు నిర్దేశించిన ఆశయాలే
దేశాన్నిప్పుడు శిఖరాగ్రాన నిలబెడుతున్నాయి

సగర్వంగా నిలబడే దేశ సౌధానికి
పునాది రాళ్లు మీరు
తరాలు మారినా,యుగాలు మారినా
మా గుండెల్లో
చిరకాలం కొలువుండే చిరంజీవులు మీరు



-ఎన్. నరేశ్ చారి
9701334516

## పేగుబంధం

అదో అద్భుత ప్రపంచం
చూసే చూపులు
పొందే అనుభూతి
కలిగే ప్రేరణ
ఇంకా ఇంకెంత అద్భుతంగా
ఉంటుందో కదా..!

తన్మయత్వంతో
పూర్తి ఎరకతో
ఏకాగ్రత చెదరకుండా
రెప్ప వాల్చకుండా
భద్రపరిచే జ్ఞాపకాలు
ఇంకా ఇంకెంతటి
అమెఘమైనదో కదా..!

భాషా రాక
యాస తెలియక
భావంతోనే
భావోద్వేగాల మధ్య
జరిగే సంభాషణ ఎంతటి
అద్వితీయమో కదా..!

అది ప్రేమో
లేక బందమో
అదికాక రక్త సంబంధమో
తెలియకుండానే
అల్లుకపోయిన
ఆప్యాయతలు మరెంత
కమనీయమో కదా..!

ఆ మధురానుభూతిని
స్వీకరించే మనసు
పులకరించే తనువు
పరస్పర తనువు
కొలవలేని వెలకట్టరాని
పంచుకుంటున్న ఈ
పేగుబంధం
ఏ జన్మలో అపురూప
అనుబంధమో కదా..



-పోలీస్ భీమేష్
9505255218

## పల్లెసీమలో..బాల్యం

పల్లెతల్లి పిలుస్తోంది
ప్రేమ వాత్సల్యాల చేతులు సాచి
రా.! రమ్మని..
నా బాల్యమంతా పల్లెఒడిలో
పచ్చ పచ్చగా గడిచింది
నా చిన్ననాటి పల్లెసీమ
నేటికీ అలాగే వుంది
ఆప్యాయత అనురాగాలను అందిస్తూ
పచ్చ పచ్చని అందాలను చిందిస్తూ
నా పల్లెసీమ నేటికి అలాగే వుంది..

నా బంగారు బాల్యాన్ని
భద్రంగా భద్రపరిచాను
పచ్చని పల్లెపేటికలో
నేటి పట్టణపు
నా ఉరుకుల పరుగుల జీవితంలో..
అలసి సొలసి ఆటవిడుపుగా
పచ్చ పచ్చని పల్లెసీమకు చేరుకుంటే..

నా బాల్యం
చిరుపాదాల ముద్రలు
కనిపిస్తాయి మురిపిస్తాయి
పచ్చ పచ్చని మైదానాలు
తివాచీలు పరచి స్వాగతం పలుకుతాయి
ఆ పచ్చని మైదానాల్లోనే
నేస్తాలతో ఆటలు పాటలు కేరింతలు
ఒకచోట కబడ్డీ..ఒకచోట ఖోఖో
ఇంకోచోట పంతంగుల ఎగురవేత
మరోచోట సిర్రగోనె ఆట
ఆటలు ఆడిఆడి
ఆనందంగా అలసిపోతే
మామిడి తోటలో
మామిడి కాయలు కోసి
అందరికీ ఇచ్చేవాడు మా అంజిరెడ్డి
అవి తింటూనే..
పచ్చగడ్డి పరుపుపైన
వెల్లకిలా పడుకొని సేదతీరుతుంటే
అలాఅలా ఆకాశం కేసి చూస్తూవుంటే..

పక్షుల కిలకిల రావాలు
తియ్యని రాగాలై వినిపించేవి
తెల్లని కొంగల బారులు
మల్లెల మాలలుగా కనిపించేవి
నీలి మబ్బులు
మాకు గొడుగులు పట్టేవి
అంతలోనే ఇంద్రధనస్సు వంతెన వేసి
రా.!రమ్మని పిలిచినట్టు అనిపించేది
ఆ పక్కనే సెలయేటి
గల గలల సవ్వడి
సుమధుర సంగీతంలా వినిపించేది
అల్లంత దూరంలో
కొండపైన కొలువైన
కోదండరాముని సన్నిధికి చేరుకొని
ఆ దేవుని దీవెనలందుకొని
కోవెల జేగంటలు మ్రోగించిన
ఆనాటి అపురూప దృశ్యాలు
ఈనాటికీ మరపురాని జ్ఞాపకాలు..


బాల్యపునాటి దృశ్యాలను వదిలి
పచ్చ పచ్చని పల్లెసీమను వదిలి
ప్రశాంతమైన పల్లె లోగిలిని వదలి
కల్మషం లేని మనుషులను వదలి
ఆత్మీయతా ఆప్యాయతలను వదలి
మళ్లీ పట్టణానికి ప్రయాణమంటేనే
మదినిండా కొండత దిగులు
అంతులేని గుబులు

– బూర దేవానందం
9494996143.

పుస్తక సమీక్ష

# సామాన్యుల త్యాగయ్య.. పాలడుగు నాగయ్య!

బహుముఖ ప్రతిభాశాలి.. బహుగ్రంథకర్త.. బోధన, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో తమ అసమాన ప్రతిభను ప్రదర్శించి అందరి హృదయాల్లో ఓ గొప్ప కళాకారునిగా కొలువుదీరిన స్వర్గీయ పాలడుగు నాగయ్యగారి సమగ్ర సాహిత్యాన్ని ఆవిష్కరిస్తూ ఓ గ్రంథం వెలువడింది. నాగయ్యగారి కుమార్తె, ప్రస్తుత డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీమతి పాలడుగ సరోజినీదేవిగారు మరియు గద్ద నర్సింగరావుగారు సంయుక్త సంపాదకత్వంలో "పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం" పేరుతో ఓ గ్రంథాన్ని ప్రకటించారు. నాగయ్య గారి ప్రతిభా పాటవాలు.. ముందు తరాలకు స్ఫూర్తిని కలిగించేందుకు సరోజినీదేవి గారు ఈ గ్రంథ ప్రచురణకు పూనుకోవడం అభినందనీయం. నాన్నపై ఆమెకున్న భక్తి శ్రద్ధలు.. అందరికీ ఆదర్శప్రాయం.. జులై 19, 1943లో ఖమ్మం జిల్లా రామాపురంలో జన్మించిన నాగయ్య గారు స్వయంకృషితో అంచెలం చెలుగా ఎదిగి ఏప్రిల్ 14, 1982న పరమపదించిన ఆయన బోధనా రంగంతో పాటు.. సాహిత్యం.. సాంస్కృతిక రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడం ప్రశంసనీయం. ఆల్ ఇండియా రేడియోలో ఆర్టిస్ట్‌గా అందరి మన్ననలు పొందిన ఆయన సంగీతం, నటన వంటి రంగాల్లో తమ కళలను ప్రదర్శించి కళాకారుడిగా భాసిల్లారు. శ్రీ నాగయ్యగారి రచనలైన పాలడుగుపదాలు.. ఝాన్సీలక్ష్మీబాయి (బుఱ్ఱకథ), పాలడుగు గేయాలు, వీరాభిమన్యు (బుఱ్ఱకథ), పాలడుగు గేయాలు-2, బాలచంద్రుడు (బుఱ్ఱ కథ), భక్తి జనపదాల భవనము, డా।। అంబేద్కర్ (బుఱ్ఱకథ), డా।। అంబేద్కర్ (నృత్యనాటిక), మరియు ఐకమత్యము గేయ రూపకాన్ని ఈ గ్రంథంలో రేఖామాత్రంగా పరామర్శించారు. నటునిగా, పద్య, గేయ, వచన కవిగా.. రచయితగా, ఉపాధ్యాయునిగా నాగయ్యగారు సాధించిన విజయాలను చర్చించారు. సామాజిక తాత్త్విక గేయాలు కూడా రాసి నాగయ్యగారు వాగేయకారుడిగా తన అనుభవాలను అక్షరాలతో నిక్షిప్తం చేసిన సంగతిని ఈ గ్రంథం ద్వారా గ్రహించగలం..



అణగారిన వర్గాలకు అంబేద్కర్‌ను చేరువ చేసేందుకు నాగయ్యగారు అంబేద్కర్ పేరున బుఱ్ఱకథ మరియు నృత్యనాటికను రచించడం విశేషం!

నాగయ్యగారికి రచయితగా బాధ్యతనే కాక.. నిబద్ధత వుండటం విశేషం. కవిగా, రచయితగా, అధ్యాపకుడిగా, గాయకుడిగా, బుఱ్ఱకథ రచయితగా, రంగస్థల కళాకారుడిగా.. ఆకాశవాణి కళాకారుడిగా.. ఆయన చేసిన సేవలు సదా స్మరణీయం అనే విధంగా ఈ గ్రంథంలో సమాచారాన్ని పొందుపరచడంలో ఆయన కూతురు శ్రీమతి పాలడుగు సరజనీదేవి గారి కృషి ప్రశంసనీయం.

**"భారత మాత నా భావమందున నిలువు**

**భావి వెలుగును పొందె భాగ్యము కూర్చుమ్మ"** అంటూ "నాలో భారతమాత" గేయాన్ని నాగయ్యగారు రాసిన తీరు బాగుంది. నా మనసు కోవెలలో నీమమతల నిలుపు.. నా శిరము పీఠమున నీ పాదముల నిలుపు.. నా పెదవులపై నీ ప్రేమలను నిలుపు..నీ సెలయేళ్ళ గలగలలు నా గళమున నిలుపు అంటూ ఈ గేయంలో రాసిన పంక్తులు ఆయన ఉత్తమ వ్యక్తిత్వాన్ని.. దేశంపట్ల ఆయనకున్న శ్రద్ధాభక్తులను ప్రశంసించకుండా ఉండలేము.

**"భారతీయ రారా"** అంటూ నాగయ్యగారు రాసిన గేయంలో వదురు మాటల వదలి సాగరా! పదును ప్రగతిని నిల్పగ రారా అంటూ పిలుపునిచ్చారు. "పుస్తకం" గేయంలో జగతి లోన జయమునొంద పుస్తకము చదవాలనీ.. బ్రతుకు దెరువు తెలుసుకునేందుకు పుస్తకాన్ని చదవాలని హితవు పలికారు.

**"దివ్వెల వెలుగు"** గేయంలో వనితల పండుగ ఈనాడే.. విలువ తెచ్చినది ఈనాడే.. అంటూ కొనసాగించిన పంక్తులు బాగున్నాయి.

**"మనిషి మారాలి"** గేయం ద్వారా ప్రేమ పొంగాలి.. మనిషి ప్రియము నింపాలని ఆకాంక్షించారు.

శ్రేయోరాజ్యం రావాలంటే శ్రమకు ఫలితము పొందాలంటే.. శ్రామిక జీవులు కలవాలని అంటూ "ధర్మము నిల్పసాగాలి" కవితను రాశారు.

"వనితల్లారా' కవిత ద్వారా వనితల్లారా లేవండి.. మొద్దు నిదురను వదలండి హద్దుతో బ్రతికే హక్కుల నెరిగి.. వలసలండంటూ పిలుపు నివ్వడం బాగుంది.

బాలలకు ఉపయుక్తంగా ఉండటానికి వీలుగా 'బాపూజీ కథవిందాం'.. 'పాపల్లారా' గేయాలకు ఇందులో చోటు కల్పించారు.మరో గేయంలో అందరు చెప్పినవి ఆలకించరా.. అందులోని మంచితన ము అందుకొను మురా.. అంటూ హితవు పలికారు.

పాలడుగు నాగయ్యగారు రాసిన ఝాన్సీలక్ష్మీ బాయి బుఱ్ఱకథలో ప్రార్థన.. పాటలు బాగున్నాయి. లక్ష్మీబాయి జీవిత చరిత్రను సులభమైన శైలిలో.. తందాన తానె.. సైసై.. భళి భళి అంటూ కానసాగించిన తీరు బాగుంది. ప్రదర్శనకు యోగ్యంగా తీర్చిదిద్దడంలో నాగయ్య గారు చూపిన ప్రతిభను ప్రశంసించి తీరుతాం.

రెండోభాగం 'పాలడుగు గేయాలు' అధ్యాయంలో తెంపవలదురా తెలుగు ఐక్యతను, దేశసమైక్యతను కాపాడండి బొమ్మలను కొనండి, వైకుంఠం చూపిస్తాం, బాధ తీరు వంటి గేయాలను ప్రస్తావించారు.వాటిలోని అంశాలు సామాజిక చైతన్యానికి దోహద పడేలా రాయడంలో నాగయ్యగారి నేర్పరితనాన్ని మెచ్చు కుంటాం. ఆ తర్వాత నాగయ్యగారు రాసిన "వీరాభిమన్యు" బుఱ్ఱకథ, పాలడుగు గేయాలు మూడో భాగం.. బాలచంద్రుడు బుఱ్ఱకథ.. భక్తి జనపదాల భవనము, డా।। అంబేద్కక్ (బుఱ్ఱకథ), డా।। అంబేద్కర్ (నృత్య నాటిక), ఐకమత్యము (గేయనాటిక) లకు ఈ గ్రంథంలో చోటు కల్పించారు.

ఇలా నాగయ్యగారు సంగీత, సాహిత్యాల్లో తమ రచనలు చేసి అందరినీ మెప్పించి ఓ గొప్ప కళాకారుడిగా అందరి హృదయాల్లో కొలువుదీరిన సంగతిని ఈ గ్రంథం ద్వారా తెలుసు కోగలం. నటన, విచిత్ర వేషధారణ సుద్దులు, జానపదాలు, బుఱ్ఱకథలు వంటి అంశాల్లో ఆయన ప్రదర్శించిన గొప్పదనం చూపిన మార్గదర్శనం భావి తరాలకు ఉపయుక&్తంగా ఉండే విధంగా నాగయ్యగారి కూతురు శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి తమ సంపాదకత్వంలో ఆయన రచనలను గ్రంథం రూపంలో వెలుగులోకి తేవడం స్వాగతించదగింది. నాన్నకు తగ్గ కూతురులా ఆమె కూడా రచనా వ్యాసంగం పట్ల ఆకర్షితురాలై.. తానుకూడా రచనలు చేయడం అభినందనీయం.

ఓ ఉపాధ్యాయునిగా.. ఉత్తమ సేవలు అందిస్తూనే.. సామాజిక బాధ్యతతో ఓ కళాకారుడిగా, సాహితీకారుడిగా అందరి ఆదరాభిమానాలను చూరగొన్న నాగయ్యగారి జీవితం ఆదర్శప్రాయం. భావితరాలకు స్ఫూర్తిదాయకం.. జానపద బాలల కవిగా.. సామాన్యుల త్యాగయ్యగా వెలుగొందిన నాగయ్యగారి వ్యక్తిత్వం.. నేటి బాలలకే కాక భావి తరాలకు ఎంతో ఉపయుక్తం.. నాగయ్యగారి రచన అయిన.. "మనిషి మారాలి" అనే గేయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారు 2021-22 విద్యా సం।।లో 9వ తరగతి ద్వితీయ భాష తెలుగు పుస్తకంలో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడం.. అన్ని విధాలా సమర్థనీయం.. ఇప్పుడు నాగయ్యగారు లేకపోయినా ఆయన సాహిత్యం అందరికీ ప్రేరణనివ్వడం ఆహ్వానించదగిన అంశం.. ప్రతి గ్రంథాలయంలో.. ప్రతి పాఠశాలలో ఉండదగిన గ్రంథ మిది. ప్రతీ ఒక్కరు చదువదగింది.

**ప్రతులకు:** పాలడుగు సరోజినీదేవి
ఇ.నెం. 45-63/2 ఎర్రకుంట-
నాచారం-
మేడ్చల్ జిల్లా- 500 076
సెల్: 9248793710



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## బడి నానీలు

తరగతి గదికి
ఎంత ఓర్పు!
దశాబ్దాలుగా
వింటూనే ఉంది !

సహనంతో
ఎంత మంది!
తలరాతలను మార్చిందో
ఈ నల్లని హృదయం!

వార్షిక
పరీక్షలోఉత్తీర్ణత!
బ్రతుకు
పరీక్షలో విత్ హోల్డ్!

సందిగ్ధంలో
నేటి విద్యార్థులు!
రెండు భాషల
మేళవింపులతో!

బాల్యపు
స్మృతులను గుర్తుచేసింది!
నిన్నటి
త్రివర్ణ జెండా పండుగ!



-చాపల మహేందర్
9949864152

## ఆట కదా బతుకు !!

కాలం వేసే పాచికలకు
కదిలే పావులం.

కోరింది దొరికితే
నిచ్చెనలెక్కే మనసు

దురాశలు పెట్టి
మింగే దుఃఖాలపాములు

జారుతూ పైకెగబాకుతూ
ముగిసిపోయే ఆట

మనిషి జీవితం
పరమపదసోపానం..!!

-పేరిశెట్టి బాబు
9247170800

## శిలలపై శిల్పాలైనారు

ఓ చరిత్ర కారులారా...
శతాబ్దపు వీరులారా...
చైతన్య శూరులారా...
శిలలరూపంలో
ఏ ఆచ్ఛాదన లేకుండా
నిశ్చలంగా నిలబడ్డారే!!

మిమ్ములను తిలకిస్తుంటే...
మా తలలు తిరిగి
కళ్లలో నుంచి వెచ్చని
కన్నీటి బొట్లు రాలుతున్నవి...
సంపదతో నిండిన
సామ్రాజ్యాలేలిన మీరే..
ఎడ తెగని కాంక్షతో
విస్తీర్ణాన్ని పెంచుకొని
సుస్థిర స్థానాన్ని నిలుపుకొని
అధికార అహంకారంతో...
ఎన్నో చిత్ర విచిత్ర కృత్యాలతో
విర్రవీగిన మీరేనా...
ఇలా శిలలపై శిల్పాలుగా మిగిలారు!!...

సాధించినాధికారం
శాశ్వతమనుకున్నారు...
చివరికి మిగిలిందేమిటి?
ఏవీ...ఆనాటి అశ్వాలు??
దిక్కులు పిక్కటిల్లే...
జయ జయ ధ్వానాలు...
ఏవీ..యుద్ధబేరి శబ్దాలు!!
ఏవీ..సభాపర్వాల విశేషాలు!!
ఏవీ..అద్భుత అఖండవిజయాలు!!
ఏవీ..మీరు నిర్మించుకున్న
కోటగోడల అంతఃపురాలు!!
ఎక్కడ..అందమైన కాంతల పరివారం!!

మందీ...మార్బలాలు
కదన రంగంలో కదిలిన
మదగజాల... ఘీంకారాలు
ఎక్కడ...మీ పరివారం!!
ఏవీ...తళతళ మెరిసే వస్త్రాలు!!
ఎండకు వానకు తడుస్తూ
నిలబడే ఉన్నారే!!...

నిలువెత్తు విగ్రహాలై..
శతాబ్దాల తరబడి
కదలకుండా మెదలకుండా...
నిశ్శబ్ద చీకటిలో...
నిరుపయోగంగా ఉన్నారే!!

ఏ శక్తీ అడ్డుకోలేదను కున్నారు...
ఏ శక్తి నిన్ను ఆశక్తుణ్ణి చేయదనుకుని
స్వశక్తిని మరిచిపోయి
సమస్యలను కొనితెచ్చుకొన్నారు..
నిర్మించుకున్న సామ్రాజ్యం
పతనమై విచ్ఛిన్నమైంది..
చీకటి నీడలు చిందులేస్తున్నాయి...
అక్షర కాంతులు అడుగంటినవి...
ఆనాటి మీ పాలన అద్భుతమే!!...


ఓనాడు కాలం కన్నెర్రజేస్తుందని
తెలుసుకోలేక పోయారు..
అప్పటి భోగభాగ్యాలను
చూసి మురిసిపోయి
వికృతంగా ప్రవర్తించారు..
రేపటి మాయను మరిచిపోయారు...
చివరికి మిగిలిందేది!!??
ఆరడుగులనేల...!!

రక్తాన్ని చిందించి
నీవు...సాధించిందేది??
ఈ ఆరడుగులే!!...
అనంతమైన చరిత్రలో
అందనంత దూరంలో...
అనర్ఘళం మీ కళల సృష్టి..
చివరికి చేరేది అక్కడికే...
నిరంతరం తరంతరం
చరిత్రలో లిఖించ బడ్డారు!!...
మానవ సమాజంలో సిరులతో
శిలల తరులుగా నిలిచారు!!...


-అంబటి నారాయణ
9849326801

## కవితాత్మక నవల

పుస్తక సమీక్ష






పది కథా సంపుటులు 9 కవిత్వ అమృతధారల వంటి సంపుటులు, 5 నవలలు, 3 వ్యాస సంపుటులతో తెలుగు సాహిత్య లోకాన్ని అలరిస్తు న్నారు దోరవేటి (వి. చెన్నయ్య). అభినవ దాశరథి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహిత్య కళారత్నలాంటి అరుదైన, అపురూప బిరుదులు పొందిన వీరు తమ రచనలతో సాంప్రదాయ వాదులను, పిల్లలను పెద్దలను ఆకట్టుకుంటారు. సహజ సిద్దంగా అబ్బిన సాహితీ పటిమ, అధ్యాపక వృత్తితో నిరంతర చింతనకు లోనై మెరుపులు దిద్దుకుంది.

ఈ నవలకు ముందు మాట వ్రాస్తూ ప్రముఖ కవి కథకులు 'తంగేడు' పక్షపత్రిక అసోసియేట్ ఎడిటర్ శ్రీ కాంచనపల్లి గోవర్ధన రాజు 'సంప్రదాయక దుస్తులతో, చెరగని చిరునవ్వుతో, ప్రేమగా, మర్యాదగా పలకరించే దోరవేటిలో ఎన్నో ప్రక్రియలున్నాయి. తగిన శిల్ప నైపుణివుంది' అని కితాబిచ్చారు. అచ్చులో అర్థ శతాబ్దికి దగ్గరవుతున్న నిత్య సాహిత్యారాధకులు దోరవేటి పట్ల ఇది ప్రత్యక్ష సత్యం. కథ అయినా, కవిత అయినా నవలైనా, అందాల పదాల పోహళింపు. రసరమ్య భావాల గుబాళింపు, లయాన్వితమైన కనిపిస్తాయి. ఏది వ్రాసినా, పాఠకు లను ఆసాం తమూ, విడవక చదివించే రమణీ య 'రసజ్ఞత' ఉంది.

ప్రస్తుత నవల పయనమెచటి కోయి..?! లో మధ్య తరగతి మానవులలో కనిపించే తాత్వికత, ఎత్తి కష్టాలు ఎదురైనా పోరాడాల్సిం దేనన్న తెగింపు, కులము మతము, ఏదైనా జాతి యెడ ప్రేమ దేశం పట్ల భక్తి ఉండి తీరాల్సిందే పని చెబుతుంది. ప్రముఖ పత్రికలో సీరియల్‌గా వచ్చింది.నవల సాగినన్ని రోజులు పాఠకులలో ఉత్కంఠ కలిగించటానికి ప్రతి అధ్యాపం చివరి వాక్యం వచ్చే వారానికి ఎదిరిచూ సేలా, చేస్తుంది. పాశ్చాత్య రచయి తలు ఆర్థర్ హెయిలీ, ఇర్వింగ్ వాలిస్, షిడ్నీషెల్టన్ రచనలులా, నవల ఆసాంతమూ, రెండు పాయ లుగా సాగి, పాత్రలు అప్పుడప్పుడు కలుస్తూ, విడిపోతూ, చివరకు అందమైన 'జడ'గా మారినట్లు సుఖాంతమైతుంది. తర్వాతి పేజీలో ఏమవుతుందో అని ఉగ్గబట్టుకుని చదివే పాఠకులు తృప్తిగా విశ్వసి స్తారు.


కథా నాయకుడు ఈశ్వర్ ప్రతినాయకులు ఎజాజ్, అక్బరం నాయకి అందాల రాశి చక్కెర చిలుక కౌముది, పైకి గడుసుగా కనిపించినా నవనీత హృదయవైజయంతి, లా అండ్ ఆర్డర్ పరిరక్షించే ఎస్.ఐ. రవీందర్ హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డిలు విధి నిర్వహణలో కరుగ్గా చురుగ్గా కనిపించినా, ఆవ్ డ్యూటీ లో ప్రదర్శించే మానవత్వం-నిత్య జీవితంలో కనిపించేవే! తెలంగాణ యువత ఉద్యోగం దొరకక లంచ గొండితనం, ఉన్నత వర్గాల 'పీడన భరించలేక 'అన్నలు'గా మారటం మనం చూసిందే! ఇదే నిరుద్యోగం, బీదరికానికి, మతపిచ్చి తోడు అయి తీవ్రవాదులుగా టెర్రరిస్టులుగా మారి, ఆత్మాహుతి గావించుకోవటం తరుచుగా పత్రికలలో మనం చదూతున్నదే. వీటన్నింటిని సంఘటనల సమాహారంగా మలిచి అందమైన నవలగా అందించారు దోరవేటి.

క్రికోట్‌పిచ్చి, ఫెటింగ్‌లు, యాసిడ్‌దాడులు, ఒక నిరుద్యోగి తల్లి పడే బాధ, వ్యధ, అటు తండ్రి, ఇటు కొడుకు యవ్వనం పట్ల కలిగే సహజమైన ఆకర్షణ, అయినా, హద్దులు మీరనితనం- ఇవన్నీ, రచయిత నిత్య జీవిత గనమంలో చూసి, వ్రాసిన సంఘటనలు, సన్నివేశాలు. చాఇ అనే తెలుగు పండితుడు, ఆయన కుటుంబం విశారదుడనే చారి బావమరిది ద్వారా ప్రతేశపెట్టిన హాస్యం ప్రధాన కథకు అంతగా సంబంధం లేకున్నా, సినిమా స్క్రిప్ట్‌లాగా ఓ సక్సెస్ ఫార్ములా ప్రకారం జొప్పించాడనుకోవాలి. కథా గమనంలో ముస్లిం కుటుంబాలు వాడే ఉర్దూ వాక్యాలు, సంభాషణలు, సహజత్వాన్ని చేకూర్చాయి. రచయిత వైజయంతి ద్వారా Split-Personality మనఃస్తత్వాన్ని బాగా చెప్పారు. ఎవరూ తోడులేని ఏకాకి జీవితంలో కలిగే అభద్రతా భావాన్ని వైజంతి పాత్ర ద్వారా చూపించారు రచయిత. కవులు కవిత్వం వ్రాసినా కథచెప్పినా, నవల అందించినా అబ్బిన పద నైపుణ్యం ఎక్కడో ఓ చోట తప్పక కనబడుతుంది. సింగరాచారి విశారదుల మధ్య సంభాషణలో "వెళ్ళిపోయి" (పే.69) అన్న పదానికి అన్వయించిన అర్థం, విశ్లేషణ, సున్నితమైన హాస్యానికి వాడినట్లు కనిపించినా ఆలోచించ గలిగే వారికి లోతైన భావం స్ఫురిస్తుంది. దరిద్రుడు దరఖాస్తు చేస్తే తప్తరే లేచిపోయింది(పే.76) మర్‌జాయేంగే మజ్‌హబ్ కేలియే (పే.123) లాంటి పదాలు దోరవేటికున్నా ఉర్దూ భాషా పాండిత్య ప్రకర్ష ద్యోతకమవు తుంది. కోపం మహా చెడ్డదనుకుం టాంగానీ, అదీ ఒక్కోసారి మేలు చేస్తుంది. (పే.68) సంగీతానికి భాషా భేదం లేదు (పే.102) కవులకు తాము రచించిన కావ్యాలు పుత్రికలు. అంటే నేనొక కావ్య కన్యకకు తల్లిని కాబోతున్నాను (పే.164) అక్బర్ నామా (పే.20) లాంటి పదాలు వాక్యాలు రసజ్ఞులైన పాఠకులకు జీడీపప్పులా 'మధురంగా' తగుల్తాయి.

సాధారణ కథతోనే అసాధారణమైన, ప్రతిభ చూపిస్తూ దేశభక్తి, మంచితనం, మానవ సంబంధాల మధ్య కనిపించే 'గరిమ' చివరకు అంతా విశ్వ కళ్యాణమేనన్న ముగింపు ఆశావహ దృక్పథాన్ని, జాతియెడ రచయితకు గల ప్రేమను తెలియచేస్తాయి.

కవిత్వం క్లుప్తంగా చెబుతుంది. నవల వివరంగా వివరిస్తుంది. ఈ రెంటి 'మేలు కలయిక' మన పయనం మంచిదారుల వెంట నిరూపిస్తుంది.

ప్రతులకు:దోరవేటి
2-315/బి/45
బేనర్జీ స్లోప్స్, జల్‌పల్లి
హైదరాబాద్-500 006
సెల్: 99636 83558


- కూర చిదంబరం
సెల్: 8639338675

## గొప్ప

చేత కన్న' చేయూత" గొప్ప
సమస్య కన్న" పరిష్కారం" గొప్ప
సంక్షోభం కన్న "సంకల్పం" గొప్ప
దోపిడీ కన్న "దానం "గొప్ప
చీకటి కన్న "వెలుతురు "గొప్ప
చీత్కారాల కన్న" చిరు సహాయం" గొప్ప
ఆత్మ వంచన కన్న "ఆత్మగౌరవం" గొప్ప
ఆందోళన కన్న" ఆనందం"గొప్ప
అవహేళన కన్న" ఆదరణ "గొప్ప
అవమానం కన్న "అభిమానం" గొప్ప
అసహనం కన్న "సహనం" గొప్ప
అరాచకం కన్న "అభివృద్ధి "గొప్ప
సంఘర్షణ కన్న "సమన్వయం" గొప్ప
సంక్షోభం కన్న "సంక్షేమం" గొప్ప
కఠినత్వం కన్న "కారుణ్యం "గొప్ప
కరువు కాటకాల కన్న "పాడిపంటలు" గొప్పవ్యక్తి
వ్యక్తి కన్న "దేశభక్తి "గొప్ప
సంకుచితత్వంకన్న"సమరసత" గొప్ప
వ్యక్తి వికాసం కన్న "సమాజ వికాసం" గొప్ప
పదవి కన్న "పార్టీ "గొప్ప
వ్యక్తి కీర్తి కన్న "దేశకీర్తి "గొప్ప
విదేశీ కన్న "స్వదేశీ "గొప్ప
సాంప్రదాయం కన్న "సంస్కృతి"
గొప్ప ఆశ కన్న "ఆశయం" గొప్ప
శతృత్వం కన్న "స్నేహితము" గొప్ప
విరోధం కన్న "విశ్వాసం" గొప్ప
పతనం కన్న" ప్రగతి "గొప్ప
వ్యక్తి సంపద కన్న "జాతి సంపద" గొప్ప
ఉగ్రవాదం కన్న "ఉద్ధరణ వాదం" గొప్ప
మారణ హోమం కన్న "మానవీయత "గొప్ప


-నేదునూరి కనకయ్య
9440245771

## దేశ భక్తి పై నానీలు

జెండాకు
హారతి
దేశానికి
నిరతి.

మన దేశం లో
అనంత సృజన
ఎందుకు
విదేశీ భజన.

మదినిండా
దేశ భక్తి
చాటుకోవాలి
యువ శక్తి.

వీరులకు దేశం
పుట్టిల్లు

ధర్మం సదా
వర్ధిల్లు,

గాంధీజీ
కాదొక వ్యక్తి
దేశానికి
కావాల్సిన శక్తి

జెండాపై
అభిమానం
దేశం కోసం
ప్రాణం


జెండా
పండగ
దేశ భక్తి
మొందుగ.

పెరగాలి
దేశం పై మోహము
తొలగాలి
విదేశీ వ్యామోహము.


-శిష్టి శేషగిరి
9290652632

## సరస్వతీ నగర్ అంగన్ వాడి కేంద్రం...


నిరుపేదల నిరాశల
నిట్టూర్పు సెగల బ్రతుకులు?.
జల్సాల,వింతకోరికల
సిటీలక్జరీ లైఫ్ లు....
పబ్ లు ,బార్ల
బెంజ్ కార్ల గురించే తెల్వని
చీకటీవెలుగులు
పగలు ప్రతీకారాలు
ఈ మాయా ప్రపంచం
మతలబసలు తెల్వని
నువ్వులు పూసిన మల్లెలు
ఏ మకిలీ అంటని పసి మనసుల
అంగన్ వాడి కేంద్రం అది
రిక్షావాడు ,కూలీవాడు
బిక్షగాడు,బొమ్మలమ్ముకునేవాడు
ఇంజనీర్,సాఫ్ట్ వేర్
గవర్నమెంటు టీచర్,ఆమ్ ఆద్మీ
అందరి మనసుదోచిన
అంగన్ వాడి కేంద్రం అది
గుడిసే నుండిఅపార్ట్ మెంట్ దాక
నడిచి వచ్చే చదువుసందెలగుడి అది
మమకారంవల్లే వేసుకుంటున్న బడి
ం,ః,అ,ఆలు,అఆలు
ఎక్కాలు,'కకా' గుణింతాలు
తరలిపోని వసంతాలు
అల్లిబిల్లి మాటలు
అలసటరాని ఆటపాటలు
ఇరుకు గదుల్లోవిశాల భావం
నాలుగు గోడల్లోనవలోకం
సమసమాజం మోడ్రన్ రూపం
పేద ,ధనిక సమానమైన రేఖాంశం అది
మార్పు కలలుగన్న
స్వప్నదేశం అది.



-రమేశ్ నల్లగొండ
8309452179

## ఎప్పటికీ చెరిగిపోనిది

సమస్యల జడివాన
కుటుంబ గూటిని ముంచెత్తినా
గొడుగు దివ్వెయై
నిస్వార్థ అభయహస్తమందిస్తుంది.
కష్టాల కొలిమికి
తేనె మనసు కకావికలమైనా
చల్లని లేపనమద్ది
కొండంత స్వాంతన చేకూరుస్తుంది.
పవిత్రమైన గంగా జలములా
త్యాగనిరతికి ప్రతీకయై
స్వచ్ఛమైన మంచులా
స్నేహపు మధురిమలను పూయిస్తుంది.
తేనె తీయదనములా
మానవతతో మెరుస్తూ
కోకిల గానంలా
జీవిత వీణను మీటుతుంది.
గుండెలు వేరైనా చప్పుడు ఒక్కటియై
కన్నులు నాలుగైనా చూపు ఒక్కటిగా
ఎప్పటికీ చెరిగిపోనిదై
మనసు మందిరాన్ని
పులకింపజేస్తుంది


-పిల్లి హజరత్తయ్య,
9848606573





సెల్: 9440622781


అమ్మ
నిరంతర శ్రమ గీతం
ఇంకిపోని
కన్నీటి జలపాతం!





పిల్లలు మానేశారు
నిక్కర్లు
పెద్దలు తొడుక్కుని
కొడుతున్నారు చక్కర్లు!


కొత్త వైరస్ ఆట!
ఊరంతా జబ్బు చేసింది
డాక్టర్లకు
డబ్బు చేసింది!





కన్న ప్రేమ
కనుల వాలే కల
కమనీయ దృశ్యం
ఎవరి భాగ్యం వారిదే!

ఇప్పుడు
అందరి చేతుల్లో యాపిలే
ఆరోగ్యం మాత్రం
పగటి కలే..



## తిరుగ బడ్డ అరకలు

దుక్కులు దున్నిన ఆ చేతులు
దుడ్డు కర్రలై ఎదురు తిరిగినయి
కలుపు తీసిన చేతులు
పత్తి విత్తనాలు విత్తినయి
పురుగుమందు తాగి బేజారైన
రైతన్నలను చూసి చలించీ
తిరుగబడ్డ అరకలు.

చావుకు సిద్ద పడ్డ తండ్రీ కొడుకుల కోసం
ఊరు ఊరంతా కదిలింది
పొలాల్లో వుండే రైతాంగమంతా
రోడ్డెక్కి ముక్త కంఠంతో నినదించింది

చేన్లో తిరుగ బడ్డ జనాన్ని చూసి
పొలం విడిచి పరుకల్లు పట్టిన
భూ బకాసురులు
చేతులు తాకితేనే! చేన్లఎగబడి,
దుక్కులు దున్నిన నాగళ్లు

మదన పడ్డ మనసులకు
మనోధైర్యం నింపిన మానవీయం
చేతులు చాచి ఓదార్చిన
మట్టి మనుషుల ప్రాణ స్పర్శ
బతుకు బండి బురదలో దిగబడితే
భుజం భుజం కలిపి ఒడ్డుకుచేర్చి
చేయుత నిచ్చిన మనిషితనం

భూతల్లిని నమ్ముకున్న
కర్షకుల కలల అలలు
అమాంతం అంతమైనపుడు
ఎత్తు పల్లాలు ఎరుగక
ఎదురు తిరిగిన ఊరది
సాముహికంగా సాగిన
అరకల పరుగులకు
తోకముడిచిన భూకబ్జాదార్లు.

దూర దాటిన దండును చూసి
కదిలి వచ్చిన అధికార గణం
పచ్చని నోట్ల కట్టల బరువుకు
సరితూగని అధికార న్యాయం
అన్నదాతకు అగచాట్లు అల్లుతున్న
ధర్మంలేని ధరణి విధానం.
(భూకబ్జాతో పురుగు మందు తాగిన తండ్రీకొడుకులు తిరుగబడ్డ కజ్జర్ల ఊరు )


-బొల్లారపు బాబన్న
9440654583

## ఓ మనిషీ మేలుకో

ఓ మనిషీ మేలుకో!
కాలం కదులుతోంది
దీపం వుండగానే
ఇల్లు చక్కదిద్దుకోవాలి
సూర్యుడే దీపం
పగలే నడిచే కాలం
రాత్రి నిద్ర
చంద్రుని చల్లదనంలో
ఇంకాస్త ముందుకు
కదులుతోంది
గాలి పెనుగాలై
వీయక ముందే
నీరు ఉప్పెనై
పొంగక ముందే
పుడమి తల్లి
భారంగా కదలక ముందే
ఆకాశం మబ్బులతో
కమ్మేయక ముందే
నిప్పు దావానలంలా
రేగక ముందే
కట్టెలు పానుపుపై
పవళించే రోజు
రాకముందే మేలుకో
ఆగని కాల ప్రయాణంలో
ఆగిన ఊపిరి ఆత్మ
అంతరాత్మ లో
కలవక ముందే
నీ పనులన్నీ చక్కబెట్టుకో
మేలుకో ఓ మనిషీ మేలుకో!

-రావులపాటి నాగమణి,
9381690364

## పెద్ద బాల శిక్షలాంటి కావ్య శాస్త్రం

### ఎన్నటికీ వన్నె తగ్గని శేషేంద్ర సాహిత్యం

తెలుగు సాహిత్యానికి శ్రీశ్రీ తర్వాత గుర్తుకి వచ్చే ఏకైక మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. ఇద్దరూ సమానమైన ప్రతిభ కలవాళ్లు. అంతేకాదు ఎస్టాబ్లిష్‌మెంట్‌కి దూరంగా మెదిలిన వాళ్ళు. ముఖ్యంగా శేషేంద్రని సాహిత్యంలో అధ్యయనం చేయకుండా; వారి సూచనలు పాటించకుండా ఎవరూ రాయడానికి ఏమాత్రం పూనుకోలేరు. ఒకవేళ విస్మరించినవాళ్ళు ఎదుగుదల, లేకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడనే చందంగా ఆగిపోతారు. బలహీన రచయితలుగా మిగిలిపోతారు. అలా కవులు ఆగిపోకూడదనే భావనతోనే యుగ కవి శేషేంద్ర మనకి ఆధునిక కావ్యశాస్త్రంగా ఉద్దేశింపబడిన 'కవిసేన మేనిఫెస్టో' అందించారు. ప్రపంచంలోనే ఇంతటి విలువైన శాస్త్ర గ్రంథం సాహిత్యానికి సంబంధించి లేదని; మరి రాదని చెప్పడంలో నేనేవి? అతిశయోక్తిని ఆశ్రయించడం లేదు. ఉన్న విషయం నిక్కచ్చిగా చెప్తున్నాను అంతే. ఇందులో ఎలాంటి శషభిషలకీ ఆస్కారం లేదు. కాదన్న మాదన్నలు ఎవరైనా ఉంటే వారిది అధోగమన భావజాలంగానే భావించి వారికి ఒక నమస్కారం పెడ్దాము. శేషేంద్ర గురుతుల్య సూచనలకి అడ్డుతొలగమని మరీ ప్రార్థించడంలో తప్పులేదు. సాహిత్యంలో సంస్కారం ఒకరికి నేర్పించేది కాదు. చెప్పినా అబ్బేది కాదు. శేషేంద్రని ఎలాంటి రంగు కళ్ళజోళ్ళు లేకుండా అధ్యయనం చేస్తే అట్టివారు బాగుపడ్డారు. గుర్రాన్ని నీటి దాకా తీసికెళ్ళగలం తప్ప తాగించలేము. అట్లనే శేషేంద్ర వారి ఔన్నత్యం గురించి ప్రకటించగలమేగాని వారి సూచనలు కవిత్వ రచనలో పాటించగలమని చెప్పగలవేగానీ, ఎవర్నీ బలవంతం చేయలేము. అది అవసరం కూడా! అయితే గుర్తు చేయాల్సిన అవసరం ఉంది కనుక కొద్దిగా 'కవిసేన మేనిఫెస్టో' గురించి మాట్లాడుకుందాము. అవసరం ఉంది కనుక కొద్దిగా 'కవిసేన మేనిఫెస్టో' గురించి మాట్లాడుకుందాము. కవిసేన మేనిఫెస్టో మొదటి ముద్రణ 1977లో జరిగింది. నాల్గవ రివైజుడ్ ముద్రణ జనవరి 15న 2022లో మళ్ళీ ఓ వసంతంలా మన ముందుకి వచ్చింది. అంతేకాదు ఈ గ్రంథాన్ని ఆన్‌లైన్‌లోనూ ఉంచటం ఎంతో శుభపరిణామం. అంటే తిరిగి 45 సంແరాల తర్వాత మన ముందుకి రావటం వెనకాల ఆ గ్రంథ ఔన్నత్యం, దాని ప్రాసంగికత ఎంత ఉదో గమనించదగ్గ అంశమే కాదు, వివేచన చేయవలసిన సందర్భం చాలా ఉందని గుర్తు చేసుకుందాం. ప్రాచీన అలంకార శాస్త్రాలని మధించి; ఆధునిక మార్క్సిస్ట్ దృక్పథంతో శేషేంద్ర తన అభిప్రాయాలను ముక్కుసూటిగా చెప్పి ఓ అధ్యయన శాస్త్రంగా ఈ వ్యాసాలను అపార పాండిత్యంతో రచించారు. కవిత్వం ఎవడయినా రాయవచ్చనీ పుట్టుక దాన్ని నిరోధించలేదని శేషేంద్ర స్పష్టం చేశారు. కవిత్వ సిద్ధికి నూతన ప్రతిపాదనలు ఆవిష్కరించారు. సామాన్య జనుల్లో సుషుప్తిథ, కవిలో జాగృత థ ఉంటుందని గుర్తు చేశారు. కవిత్వానికి సామాన్య అనుభూతి పనికిరాదని, విలక్షణ అనుభూతి కావాలని చెపూ జగన్నాథుడు చెప్పిన విలక్షణ వ్యుత్పత్తి గురించి చర్చించాడు. పాండిత్య సముజ్వలిత అనుభూతీ; అనుభూతి ప్రజ్వల్విత పాండిత్యమూ కవికి అవసరమనే భావనతో కావ్య వి?మాంస కారుడైన రాజశేఖరుడి, "ప్రతిభా వ్యుత్పత్తి మిథః సమవేతే శ్రేయసౌ" అనే సత్యాన్ని చర్చించాడు. ప్రాచీన అలంకార శాస్త్రాలపైన కనీస అవగాహనని కలిగించే విధంగా రచించిన పెద్ద బాలశిక్ష లాంటి పుస్తకం ఇది. కొత్తగా సాహిత్య విద్యార్థులని ఉద్దేశించే ఈ ఆధునిక కావ్యశాస్త్రమే రచిచంటంలో శేషేంద్ర ఎంతో శ్రమ తీసుకొని తన అపారశాస్త్ర, సాహిత్య విజ్ఞానాన్ని కవిసేన మేనిఫెస్టోలో పొందుపరిచాడు. అందుకు మనం శేషేంద్రకి ఎంతో రుణపడి ఉన్నాము.



శేషేంద్ర అసలు కవిత్వమే ఒక విచిత్ర భాష, సామాన్య భాష కంటే భిన్నమైనది. కనుక అందరికీ అర్థం కావాలని గాని ఉత్తర్వు చెయ్యడం సాహిత్యంలో తుగ్లక్ పరిపాలన అవుతుందని నిర్వచించాడు. అప్పటిదాకా ప్రచలితమవుతున్న సాహిత్య ధోరణిని ఎండగట్టాడు. అర్థం అవడం అవకపోవడం అనేది కవిత్వానికి సంబంధించిన విషయం కాదనీ, అర్థం అవడం భాషకు సంబంధించిన విషయంగా తేల్చిపారేశాడు. కానీ ఈ రోజుకి కవిత్వం అర్థం కావాలనే నిర్ణయకర్తలు మనకి విమర్శకులుగా తిరుగుతున్నారు. వారు ఈ నాటికీ శేషేంద్రని అర్థం చేసుకోలేదని తెలుస్తున్నది. రాజకీయ భావజాలాల వ్యాప్తికి కవిత్వం, ఒక సాధనం కాదు; అందుకు వేరే ప్రక్రియలు కోకొల్లలు వుండంగా; కవులను ఇంకా వారి రాజకీయ ప్రయోజనాల కోసమే తర్ఫీదు ఇవ్వటం శేషేంద్ర గర్హించాడు. వద్దని వాదించాడు. అది ఆనాటి విప్లవ శ్రేణులకి ఆగ్రహం కలిగించింది. తమ విప్లవ ప్రయోజనాలకి శేషేంద్ర అడ్డంకిగా మారాడని కవిసేన మేనిఫెస్టో వి?ద ఆనాడు దుమ్మెత్తి పోశారు. వాళ్ళకి తగ్గట్టుగా అంతే స్వరంతో తీక్షణంగా శేషేంద్ర తన వ్యాసాలలో సమాధానాలు ఇచ్చాడు. వాళ్ళ అట్లకి తిట్లతోనే ఎదుర్కొన్నాడు. సోమసుందర్ లాంటి పెద్దలు శేషేంద్ర ఈ తట్ల పురాణంకి దూరంగా ఉండాల్సిందని తీర్పు ఇచ్చారు. కానీ శేషేంద్రలోని మార్క్సిస్ట్ తన తిరుగుబాటు జండాని ఏ మాత్రం దించలేదు. ఇది ఆనాటి తెలుగు సాహిత్య వాతావరణం ఏ విధంగా ఉందో చెప్పటానికి మాత్రవే నా జ్ఞాపకాలని ఇక్కడ పొందుపరుస్తున్నాను. ఆ రోజుల్లో శేషేంద్ర పైన చాలా తీవ్రమైన దాడి జరిగింది. శేషేంద్రని, ఆయన ఖ్యాతిని నిలువరించటానికి ఈ రోజునా అంతఃపుర కుట్రలు జరగటం ఎంతో శోచనీయం. 1987 ప్రాంతంలో ఆంధ్రజ్యోతి వారపత్రికలో కామోత్సవ్ నవల సీరియల్‌గా వచ్చింది. శేషేంద్ర కన్నుమూసిన తొలిరోజుల్లో కొందరు కామోత్సవ్ మేము రాశామంటే మేము రాశామని బురద జల్లారు. జనవరి 2021లో కామోత్సవ్ మూల రచన తొలిముద్రణగా బైటకి వచ్చింది. అభూత కల్పనతో వచ్చిన నకిలీ కామోత్సవ్ అసలు కామోత్సవ్‌కి తేడాని విమర్శకులు గుర్తించి శేషేంద్రకి న్యాయం చేశారు. కానీ ఈ అన్నింటి కుట్రలని శేషేంద్ర కుమారుడు సాత్యకి ఒంటి చేత్తో ఎదుర్కొంటున్నాడు. శేషేంద్ర రచనలని ప్రజలకి దగ్గరకి చేర్చి కుమారుడిగా తన బాధ్యతలు నెరవేరుస్తున్నాడు. ఇది ఇలా ఉండంగా... శేషేంద్ర వెలుగునీడలో - నాన్నతో నా అనుభవాలు అంటూ మరెవ్వరో రాసిన పుస్తకం ఆయన పెద్ద కుమారుడి పేరిట వెలువడింది. అందులో శేషేంద్ర వ్యక్తిగత జీవితంపై దారుణంగా బురద చల్లటం జరిగింది. ఈ అంతపుర కుట్రలు ఎన్ని జరిగినా శేషేంద్ర సాహిత్యం ఎన్నటికీ వన్నె తగ్గదు. ఆయన సాహిత్యం అజరామరం.

(శేషేంద్ర 30 వే నెల వర్ధంతి సందర్భంగా)


- సాగర్ శ్రీరామ కవచం
98897 73934

## శ్రమ జీవులు - పారిశుద్ధ్య కార్మికులు!!

పట్టణాన్ని రమ్యంగా తీర్చిదిద్దు వారు ..
పరిశుభ్రతనే సేవగా భావించువారు ..
పర్యావరణాన్ని పరిరక్షించువారు..
శ్రమజీవులు వారు..
ప్రజల సేవకులు వారు...
స్వచ్ఛమైన వాతావరణాన్ని
అందించువారు.. నిర్మించువారు...
అపరిశుభ్రత నిర్మూలనకై
నడుం బిగించిన వారు..
తమ ప్రాణాలు పణంగా పెట్టి
మన ఆరోగ్యాన్ని రక్షించువారు..
బతుకు బండిని నడిపించుకొనుటకు
అష్ట కష్టాలు పడేడివారు..
చెత్త బండిని మోసుకెల్లుటకు..తీసుకెళ్ళుటకు..
పడరాని పాట్లేన్నో పడేడివారు .
చాలీచాలని వేతనాలతో బ్రతుకునెల్ల దీయువారు
వీధుల్లో గాయపడిన మీకు తగిన రక్షణ ఏది?
మీ బాధలు వినెడి నాథుడేడి.?
మీ హృదయావేదనలు కనెడి నాథుడేడి?
మీరు కార్చేడి కన్నీళ్ళకు కనికరం చూపని
కసాయి లోకమిది.
ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా
మీ బ్రతుకులు మార్చకపాయె
ఏ నాయకుడేలిన గాని ,
మీ గూర్చి తలపడాయె
(రెక్కలు ముక్కలు చేసుకుని - పనిచేసే శ్రమ జీవులారా - మీకు వందనాలు)

-జక్కుల శివ ,
ఇంటర్మీడియట్ విద్యార్థి.

## హిమగిరి శిఖరాలు..!!

గగనాన్ని తాకుతూ వెండికొండలు
ఆ మంచు మబ్బులకు ఆవాసాలు
కరిగి గలగలపారే గంగాప్రవాహాలు
విభూతి భూతి ఏలే హిమ గిరులు.

తిరిగిరానిదే తరిగి పోయే వయసు
బాల్యకౌమార యవ్వన వృద్ధాప్యం
నాలుగతుకుల తానురా ఆయువు
కరిగిపోయే హిమశిఖరమే బతుకు

నవమాసాలశిఖరంపై నరుడిజన్మం
మంచుకొండలా చల్లనైన తల్లిగర్భం
కరగదుతరగదు కొండంతకన్నప్రేమ
ఏజన్మకైనా హిమశిఖరమేగా అమ్మ.

ఆ గుండెల నిండా కొండంత ధైర్యం
కష్టనష్టాలెన్నో తట్టుకునేంత స్థైర్యం
తొణకిసలాడే చిరునవ్వుల నగము
అంతెత్తు హిమగిరి శిఖరమే నాన్న


-పేరిశెట్టి బాబు
9247170800

